స్కెచ్

# సుజ్ఞానం - సుశీ

సులోచన

ఒక్కసారిగా- పదిమంది ఒక్కచోట గుమిగూడటం సుశీని కలవరపెట్టింది. కమ్మని సంగీతం- 'సురయ' పాడే పాటను వదలి రావాలంటే మామూలుగా కష్టమనిపించేది. వయస్సు చిన్నదైనా సంగీతం మీద అభిలాష అధికం. అదే సుశీలో వున్న విశేషం. ఆ కాలవకట్ట మీద పదిమంది ఆదుర్దాబడుతో చూడటం, చూడాలనే కౌతుకంకొద్దీ ఆత్రుతతో పరుగెత్తే జనాన్ని చూస్తోంటే, సురయ రికార్డు మీద చిరాకేసి, 'ఎక్కడికే సుశీ' అని అమ్మ పిలుస్తోన్నా వెళ్ళి అక్కడ- ఆ కాలవ కట్ట మీద వాలింది.

తల తిరిగింది. కళ్ళను గట్టిగా, రెండు చేతులతో మూసుకుంది. ఇంతవరకు, ఈ పదకొండు వత్సరాల జీవితంలో యిలాంటి దృశ్యం...కనీసం ఆలోచించైనా వుంటేగా. తనుపడ్డ అవస్థ అక్కడున్న పదిమంది ముఖాల్లో గోచరిస్తుందేమోనని చూసింది. కాని అలాంటి అంగమచ్చలేవీ వున్నట్టు గోచరించలేదు. ఒకటిమటుకు అనుకుంది: ఇటువంటి దృశ్యాలేవీ వాళ్ళకు కొత్తకావనిన్నీ, చూడటం వల్ల భయం లేదనిన్నీ. ఆ బాలిక హృదయంలో మటుకు పది సంవత్సరాలపాటు మరుపురాని దృశ్యం. మళ్ళామళ్ళా మనస్సులో చిత్రించుకొంటూ వెనక్కు తిరిగింది. రెండు గజాలదూరం వచ్చాక మళ్ళా చూద్దామనే ఉత్సుకత ఏర్పడింది. ఆ జనంలోంచి-తనశక్తి ఎంత, తన వయస్సెంతనే విచక్షణజ్ఞానం నశించి- ఎలాగో సందు చేసుకొని వెళ్ళింది. కొంచెం నిదానంగా రెండు నిమిషాలు పట్టి చూసింది. తెల్లగా పాలిపోయి, కొంచెంగా లావెక్కి, చెత్తలో చుట్టబడిన ఆ పసికందును మళ్ళా చూడాలనే వాంఛ యింటికి చేరేలోపుగా కలగలేదు

నాన్న నడిగింది- 'ఎవరు చేశారు నాన్నా, ఆదారుణకృత్యం?'

'ఎవరేమిటే, చిన్నదానివి కనక యిటువంటి దృశ్యాలు ఎన్నడూ చూసుండకపోవచ్చు. మాకు అవి కొత్తవా! ఎన్ని జరుగుతూ వుండడంలేదు. వాటినిగురించి ఆటే పట్టించుకోం గనక సరిపోతుందిగాని విచారిస్తే ఎన్నని విచారించం?'

నాన్న మాటలు ఆ అమ్మాయిని తృప్తిపరచలేకపోయాయి. మళ్ళా అన్నది-'బంగారంలాంటి పిల్ల పుడితే కాలవపాలుచేసే తెలివి తక్కువ తల్లి ఎవరుంటుంది నాన్నా!'

'ఎందుకుండదు తల్లీ? చాలామంది వుంటారు. మంచిఅంటేఅందరూ ఎందుకు పారేసుకుంటారులే- ఎవరో చెడిపోయిన వాళ్ళు.'

నాన్న అనే మాటల్లోని అంతర్యాన్ని ఆకళింపు చేసుకొనే పరిపక్వత నిజంగా సుశీకి లేదు. కాని తెలుసుకోవాలనే హాళి. పైపైన చెప్పుకెళ్ళే తండ్రిమాటల్లో అడుగడుక్కీ అనేక సందేహాలు జనించటంకద్దు. వాటన్నిటినీ తీర్చుకోవాలనే ఆశవున్నా, తండ్రి విసుగు చెందుతాడేమో అన్నత్రాసకొలదీ మనస్సుకు జవాబుచెప్పుకొంటూ వుంటుంది. కాని నాన్న అనే మాటల్లో ఒక సందేహం బలంగా కలిగింది. వెంటనే అడిగేసింది.

'నాన్నా! చెడిపోయిన వాళ్ళంటే ఎవరు?'

నిజంగా ఆ ప్రశ్నకర్థం చిన్న పిల్లలకు అనౌచిత్యం. తండ్రికి కొంచెం కోపం వచ్చింది. వాళ్ళకి అప్పుడే యిటువంటి విషయాల్నిగురించి చెపితే యిబ్బందులు పడతారనే ఊహకూడా కలిగి అన్నాడు — 'అవన్నీ నీ కనవసరం. వెళ్ళి ఆడుకో.'

ఆ బుల్లిముఖం మాంగల్య విహీనమైంది. ఒక రకంగావచ్చిన కోపం వచ్చినట్టుగానే పోయింది. ఆలోచించింది, [illegible]ానికి అలవాటుపడని , ఆ

బుర్రలో 'చెడిపోయిన వాళ్లకి నిర్వచనం లేదు. చివరకు ఒకటిమాత్రం నిశ్చయించుకొంది. 'బిచ్చగాళ్లయుంటారు. సహజంగా వాళ్ళలో పిల్లలు పుడితే తిండిపెట్టలేక పారేసుకుంటారు. తప్పకుండా వాళ్లే అయుంటారు.' ఆనిశ్చయంలో పూర్తి నమ్మకం చిక్కలేదు. సందేహాన్ని నివృత్తి చేసుకోవాలనే లాలస ఆటల్లో లేక పోయింది. ఆసాయంత్రం సంగీతం వినలేదు సరి గదా ఆటల్లో పాల్గొనలేదు. కను పూడుస్తున్న అమ్మ నడిగింది- 'చెడిపోయిన వాళ్ళంటే ఎవ రమ్మా!' అని గోముగా. అమ్మ కోప్పడింది. 'వాళ్ళతో నీకేం అవసరం, చక్కా చదువుకోక.' తుక్కిన పేనులాగ వెళ్ళింది. పాపం! అమాయిక.

రాత్రి - 'నాన్నా, నాన్నా - ఒక్కమా టడుగుతాగాని చెపుతావా?' అన్నది.

'అడుగు, చెపుతాను.'

'చెప్పకపోతే,' అనుమానం వేసింది. పొద్దున చెప్పలేదు గాబట్టి యిప్పుడుకూడా చెప్పడని.

'తప్పక చెబుతా, చెప్పకుంటే అప్పుడను.'

ఆ మాటలో సుశీకి పూర్తి నమ్మకమే కాకండా సందేహం నివృత్తి చేసుకోటానికి అవకాశం కన్పించింది.

'చెడిపోయినవాళ్లంటే ఎవరు నాన్నా?'

ఆ ప్రశ్నకు ఒక్కనవ్వు నవ్వుకున్నాడు. అబద్ధం చెప్పి అడిగించుకోకండా చేయటమే మంచి దనుకొన్నాడు. ఒక విధంగా చెప్పినా అర్థమవనే నిర్మలసత్వానికి పోయి- 'చెడిపోయిన వాళ్ళంటే ఎవరో కాదు, ప్రతిదినం మన యింటికి అడుక్కొన వచ్చేవాళ్ళు. వాళ్ళకు పిల్లలు అధి కంగా పుడతారు. పిల్లల్ని పెంచే తాహతు వాళ్ళదగ్గర వుండదు. అంచేత ఏదో ఓవిధంగా ఒదుల్చుకుంటారు' అన్నాడు. ఆ మాటల్లో పూర్తి నమ్మకం చిక్కింది సుశీకి. అదిలో తను చేసినయోచనకీ, నాన్నచెప్పిన దానికీ తార తమ్య మేమీలేదు గాబట్టి నిజం అంతకంటె వేరే లేదని నమ్మింది.

తండ్రి సంతోషించాడు. అనృతం ఆడైనా అమ్మాయి నోరు కట్టించానని. మాయలోకం.

